క్లుప్తంగా

ఘనంగా మాసశివరాత్రి వేడుకలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గల అయ్యప్ప స్వామి సహిత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారి మాసశివరాత్రి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకొని అర్చకుడు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేషపూజలు జరిపించారు. స్వామివారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

ముగిసిన 'క్రిస్మస్ స్పోర్ట్స్ కార్నివాల్'

అచ్చంపేట: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని తాళ్లచెరువులో గత వారం రోజులుగా జరుగుతున్న క్రిస్మస్ స్పోర్ట్స్ కార్నివాల్ సీజన్-6 పోటీలు ఆదివారంతో ముగిశాయి. క్రికెట్ పోటీలలో టీఎల్‌సీ ఇన్విన్సిబుల్స్ టీం విన్నర్స్‌గా నిలచి కప్ కైవసం చేసుకుంది. వేళాంగిణి మాత ఛాంపియన్స్ రన్నర్స్‌గా నిలచారు. షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలలో నెక్కింటి జోజిరెడ్డి, కాసర్ల సైదారెడ్డి టీం విజేతగా, గాదె సుధాకర్‌రెడ్డి, పన్నూరి వెంకట్రావు టీం రన్నర్స్‌గా నిలచారు. జూనియర్ కబడ్డీ పోటీలలో స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు స్పోర్ట్స్ కమిటీ సభ్యులు దొండేటి జగదీష్‌రెడ్డి, జంగంరెడ్డి రాజశేఖరరెడ్డి, కాసు సుమంత్‌రెడ్డి, కళ్లం బాలరవికిరణ్ నగదు బహుమతితో పాటు కప్, షీల్డ్ అందచేశారు. ఈ సందర్భంగా పోటీలకు సహకరించిన చర్చి పెద్దలకు, నిర్వాహకులకు, బహుమతి ప్రదాతలకు, యూత్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు పెన్షన్‌దారులు అందుబాటులో ఉండాలి

సత్తెనపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పెన్షన్‌దారులకు 2025 జనవరి 1న పంపిణీ చేయాల్సిన పెన్షన్ ఒకరోజు ముందుగా ఈనెల 31న పంపిణీ చేయడం జరుగుతుందని సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. సత్తెనపల్లి మండలంలోని పెన్షన్‌దారులందరూ ఈ నెల 31న తమ తమ గ్రామాల్లో అందుబాటులో ఉండాలని కోరారు. ఈ విషయాన్ని పెన్షన్ పొందే లబ్ధిదారులంతా గమనించాలన్నారు.

సచివాలయాల్లో షెడ్యూల్ కులాల గణన జాబితాలు

ముప్పాళ్ళ: మండల పరిధిలోని అన్ని గ్రామాలకు సంబంధించిన షెడ్యూల్ కులాల వారి కుల గణన సర్వే జాబితా వివరాలన్నీ ఆయా గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంచామని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ ఆదివారం తెలిపారు. జాబితాలో నమోదు అయిన షెడ్యూల్ కులాలకు చెందిన ప్రతి ఒక్కరూ సంబంధిత జాబితాను పరిశీలించి, అభ్యంతరాలు ఉంటే స్థానిక వీఆర్వో కు లేదా పంచాయతీ కార్యదర్శికి ఈ నెల 31వ తేదీ లోపు అందించాలన్నారు. సంబంధిత అభ్యంతరాలను వచ్చే ఏడాది జనవరి 6వ తేదీ వరకు సంబంధిత డిజిటల్ అసిస్టెంట్ లాగిన్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసి వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి పరిశీలిస్తారన్నారు. అభ్యంతరాలను విచారణ చేసిన తర్వాత తుది జాబితా జనవరి 10వ తేదీన సంబంధిత సచివాలయాల్లో ప్రచురించటం జరుగుతుందన్నారు. జాబితాలో నమోదైన ఉన్న షెడ్యూల్ కులాలకు చెందిన వారు వారి వివరాలను గ్రామ సచివాలయంలో పరిశీలించుకోవచ్చన్నారు. తప్పు ఉన్నట్లయితే వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి వారికి నిర్ణీత కాల వ్యవధి ప్రకారం అభ్యంతరాలను తగు ఆధారాలతో అందజేయాలని కోరారు.

పోస్టర్లు ఆవిష్కరణ



క్రోసూరు: ఈనెల 5వ తేదీ విజయవాడలో ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ ప్రమాణస్వీకార మహోత్సవానికి అందరూ తరలిరావాలని ఆర్యవైశ్య నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య నాయకులు ఆదివారం క్రోసూరులో ఆహ్వాన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆర్యవైశ్య నాయకులు చేగు రాము, పసుమర్తి శివ సుబ్బారావు,సనిశెట్టి శ్రీనివాసరావు, గార్లపాటి గోపి, కట్టమూరు అప్పారావు, అనుమల పూర్ణచంద్రరావు, బింగి నవీన్, గుగ్గిలం విజయ శేఖర్, అనుమాల సురేష్ తదితరులు పాల్గొన్నారు

అదుపు తప్పి లారీ బోల్తా

పిడుగురాళ్ల: పాత ఇనుము లోడు లారీ అదుపు తప్పి పడిపోయిన ఘటన మండలంలోని తుమ్మలచెరువు చెట్టు సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... పిడుగురాళ్ల వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న పాత ఇనుము లోడు లారీ రాత్రి సమయంలో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో లారీలోని పాత ఇనుము ఇనుప సామగ్రి రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

ఆదాయ వ్యయం..

పురపాలక మూలధనం

- సత్తెనపల్లి మున్సిపల్ బడ్జెట్ రూ.31.40 కోట్లు
- నేడు ఆమోదానికి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మున్సిపల్ కార్యాలయ ముఖద్వారం

సత్తెనపల్లి: సత్తెనపల్లి పురపాలక సంఘం 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.31.40 కోట్ల అంచనాలతో వార్షిక బడ్జెట్ రూపొందించారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో సభ్యులు ఈ బడ్జెట్‌ను చర్చించి ఆమోదించనున్నారు. రూ. 31.40 కోట్ల రాబడి, ఇందులో సాధారణ నిధులు ఖర్చు రూ.12.63 కోట్లు, మూలధన ఖర్చులు రూ.14.46 కోట్లు కలిపితే .. మొత్తం రూ. 27.09 కోట్లు. ముగింపు నిల్వగా రూ.4.31 కోట్లుగా తేల్చారు.

రూ.26.35 కోట్లతో వార్షిక బడ్జెట్

–2024–25 వార్షిక ఏడాది బడ్జెట్ రూ. 26.35 కోట్ల అంచనాలతో ఆరంభమై సవరణలతో రూ.26.35 కోట్లకు చేరినట్లు అధికారులు తెలిపారు. ఇందులో చేసిన ఖర్చులు పరిశీలిస్తే... సాధారణ ఖర్చులు రూ.12.2 కోట్లు, మూలధన ఖర్చులు రూ. 11.37 కోట్లు, మొత్తం రూ.23.59 కోట్లుగా లెక్క చూపారు. ఆదాయంలో నుంచి ఖర్చులు తీసివేయగా... ముగింపు నిల్వ కింద రూ.3.90 కోట్లు లెక్క కట్టారు. ఇదే ముగింపు నిల్వ 2025–26 వార్షిక ఏడాదికి ఆరంభ నిల్వగా తీసుకున్నారు.

రూపాయి రాక

ప్రారంభ నిల్వ	: రూ. 27.23 కోట్లు
సాధారణ నిధులు	: రూ. 16.54 కోట్లు
ములధన నిధులు	: రూ.14.86 కోట్లు

రూపాయి పోక

నిర్వహణ ఖర్చులు	: రూ. 12.63 కోట్లు
ప్రజారోగ్యం	: రూ.5.08 కోట్లు
విద్యుత్ నిర్వహణ	: రూ.1.44 కోట్లు
మూలధన ఖర్చులు	: రూ. 14.46 కోట్లు

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం...

పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్‌హాల్ లో సోమవారం సాయంత్రం 4.30 గంటలకు అత్యవసర సమావేశం మున్సిపల్ చైర్పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన జరగ నుంది. ఈ సమావేశంలో అజెండాలోని 30 అంశాలపై చర్చించి ఆమోదించడం జరుగుతుంది. అయితే అజెండాలో పురపాలక సంఘం యొక్క ఆదాయ వనరులు పెంపొందించడంలో భాగంగా 14వ వార్డులోని పాత బస్టాండ్ ప్రాంతంలో సర్వే నెంబర్ 197/పీ లోని పురపాలక సంఘానికి చెందిన ఖాళీ స్థలంలో షాపు రూముల నిర్మాణానికి రూ.10 లక్షల అంచనాలతో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి మంజూరు నిమిత్తం కౌన్సిల్ ఆమోదం తీసుకోనున్నారు. ఈ స్థలం పై ఇప్పటికే కోర్టులో వివాదాలు నడుస్తున్నాయి. కోర్టులో పెండింగ్ ఉన్న దానికి రూ.10 లక్షలు అంచనా వేసి కౌన్సిల్ సభ్యుల ఆమోదం తీసుకోవడానికి పెట్టడం ఏమిటని పలువురు కౌన్సిల్ సభ్యులు ప్రశ్నిస్తున్నారు

స్వాతంత్ర్యోద్యమంలో సీపీఐది కీలక పాత్ర

అరసం నేత కొమ్మాలపాటి శరత్ చంద్ర జ్యోతి శ్రీ



పెదకూరపాడులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న శరత్చంద్ర

పెదకూరపాడు: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందని అరసం ఆంధ్ర ప్రదేశ్ ప్రధాన కార్యదర్శి, సీపీఐ పల్నాడు జిల్లా నాయకుడు కొమ్మాలపాటి శరత్చంద్రజ్యోతి పేర్కొన్నారు. ఆదివారం పెదకూరపాడులో పార్టీ శత వార్షికోత్సవాల ఘనంగా నిర్వహించారు. కొమ్మాలపాటి శరత్ చంద్ర జ్యోతి శ్రీ పార్టీ జెండా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మున్న గోటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. శరత్ చంద్ర మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తాడిత పీడిత ప్రజల హక్కుల పరిరక్షించడంలో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన పాత్ర పోషించిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు బైరా పట్నం రామకృష్ణ మాట్లాడారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

స్కాన్ సెంటర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సత్తెనపల్లి ఆర్డీఓ రమణ కాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీఓ రమణకాంత్‌రెడ్డి

సత్తెనపల్లి: స్కాన్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి జీవీ రమణ కాంత్ రెడ్డి అన్నారు. పట్టణంలోని తన కార్యాల యంలో ఆదివారం పీసీ, పీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ, అడ్వైజరీ కమిటీ సమావేశంజరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కాన్ సెంటర్లు చట్ట ప్రకారం నియమాలను పాటించాలన్నారు. వాటిని అతిక్రమిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ప్రధానంగా స్కానింగ్ కేంద్రాల్లో బ్యానర్లు సక్రమంగా ప్రదర్శించాలని, సరైన రికార్డులు, ఇతర నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. లింగ నిర్ధారణ నేరమని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కమిటీ కన్వీనర్, సత్తెనపల్లి డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల తనిఖీల్లో గమనించిన విషయాల గురించి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో ఆయా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నందికుంట విఘ్నేశ్వరాలయంలో చోరీ



నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులోని శ్రీ నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయంలో చోరీ సంఘటన కలకలం రేపింది. దేవదాయ శాఖ ఇన్‌చార్జి ఈవో జక్కా శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి పూజారి ఆలయ తలుపులు మూసి వెళ్లాడు. ఉదయం రాగా, తలుపులతో పాటు ఆలయంలో హుండీ పగలగొట్టి ఉన్నాయి. అందులోని నగదు, దేవాలయంలోని సీసీ కెమేరాల రికార్డర్, మైకు, యాంప్లిఫయర్‌లను దొంగలు దోచుకెళ్లారు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ జి. పుల్లారావు సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మూడు నెలల నుంచి హుండీ లెక్కించలేదు. అందులోని నగదు, ఎల్రక్టానిక్ వస్తువుల విలువ రూ.1 లక్షకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలోత్సవం పోటీల్లో వేల్పూరు విద్యార్థుల ప్రతిభ



విజేతలకు బహుమతి అందజేస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

శావల్యాపురం: పల్నాడు జిల్లా బాలోత్సవం పోటీల్లో మండలంలోని వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంగ్రపాటి చలపతిరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడు బహుమతులు సాధించగా, క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. మ్యాప్ పాయింటిగ్లో రెండో బహుమతి, లఘు నాటికలో మూడో బహుమతి, వ్యాస రచనల్లో నాల్గవ స్థానం, కోలాటం, జానపద, నృత్యాలు తదితర పోటీల్లో బహుమతులు సాధించినట్లు తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, గైడు టీచర్స్ జె.శ్రీనివాసరావు, మరియదాస్ అభినందించారు.

గోపాలమిత్రల నూతన కమిటీ ఏకగ్రీవం



నూతన కార్యవర్గ సభ్యులతో సీఐటీయూ ప్రతినిధులు

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లా గోపాలమిత్ర సంఘ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా సిరిగిరి పిచ్చిరెడ్డి, బి.కాశీరావు ఎన్నికయ్యారు. ఆదివారం కోటప్పకొండలోని ఉడుముల గ్రాండ్ కోటప్పకొండలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.హనుమంతరెడ్డి అధ్యక్షతన గోపాలమిత్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చవ శ్రీనివాసరావు, ప్రభాకరరావుల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎస్.ఆంజనేయనాయక్, ఉపాధ్యక్షులుగా జడ్డా లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శిగా వరప్రసాద్, కోశాధికారిగా జి.శేషగిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గోపాలమిత్రల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

దొడ్లేరులో మెగా జాబ్‌మేళా



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో రావిపాటి కల్యాణ మండపంలో ఆదివారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని ప్రతి మూడు నెలలకు జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో దిగ్గజ ఫార్మకంపెనీలు కూడా హాజరవుతాయన్నారు. జాబ్‌మేళాకు 35 కంపెనీలు హాజరుకాగా 1800 మంది నిరుద్యోగులు హాజరవ్వగా 600 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు జాబ్‌మేళా కో–ఆర్డినేటర్ తెలిపారు. ఎంపికైన వారికి ఎమ్మెల్యే చేతుల మీదగా నియామక పత్రాలను అందచేసారు. అనంతరం గ్రామంలోని తాగునీటి చెరువును సందర్శించి భూగర్భజలాలు బలోపేతయయ్యేలా తగువిధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, దొడ్లేరు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెదకూరపాడు: మండలంలోని జలాలపురం గ్రామంలో చెరువు కట్ట మీద ఉన్న చెట్టు కింద పేకాటాడుతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండల పరిధిలో పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బియ్యం, సరుకులు పంపిణీ



సత్తెనపల్లి: నిరుపేద కుటుంబానికి చేయూత అందించేందుకు సత్తెనపల్లి ప్రజా చైతన్య భారతి సేవా సంస్థ ముందుకు వచ్చింది. పట్టణంలోని నాగార్జున నగర్ నందిగాం డొంక రోడ్డులో నివాసం ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఉయ్యూరు వెంకటరెడ్డి, అనురాధ దంపతుల కుటుంబానికి సంస్థ గౌరవ అధ్యక్షుడు యిర్మీయా సలహా మేరకు అధ్యక్షుడు దూపగుంట్ల జానకి రామయ్య, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మద్దిరాల గంగాధర్, న్యాయవాది సర్వేపల్లి సీతారామంజనేయులు ఆదివారం బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆ దంపతుల్లో అనురాధకు బ్రెయిన్ ఆపరేషన్ జరిగి చాలా ఖర్చుపడి రోజు వారికి కూడా ఇబ్బంది పడుతున్నారు. సంస్థ బాధ్యులు పి.ఆంజనేయులు, మల్లేశ్వరావు, కె.ప్రేమ్‌కుమార్, నాసరయ్య, ఇ.ప్రసాద్, హరిబాబు పాల్గొన్నారు.

వైభవంగా మహాన్యాస రుద్రాభిషేకం



అయోధ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్లూరు గ్రామంలోని అవధూత అయోధ్య స్వామి ఆశ్రమంలో ఆదివారం మాస శివరాత్రి పురస్కరించుకొని మహన్యాస రుద్రాభిషేకం, అయోధ్య స్వామి ఉత్సవ విగ్రహానికి , శివలింగానికి పంచామృత అభిషేకలతో వివిధ రకాల పూలతో ప్రత్యేక పూజలునిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితుడు ఆదిత్య శర్మ పాల్గొని, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటి మహారుషులు లోక కళ్యాణం కోసం మహన్యాస రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారని, తద్వారా ఆయా గ్రామాల్లో కుటుంబాలు పాడి, పంటలుతో అష్ట ఐశ్వర్యాలతో తులతూగారన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. ఆశ్రమ కమిటీ నిర్వాహకులు తాటి రామకృష్ణ, కోటేశ్వరమ్మ, సుబ్బారావు, సాయి పాల్గొన్నారు.

నేత్ర వ్యాధులపై అవగాహన అవసరం



నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వివేకానందరెడ్డి, చిత్రంలో న్యాయవాది పాములయ్య

సత్తెనపల్లి: మానవుల శరీర భాగాల్లో నేత్రానికి అధిక ప్రాధాన్యత ఉందని అటువంటి నేత్రవ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం, డాక్టర్ ఎంవీ రెడ్డి నేత్ర వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాములయ్య మాట్లాడుతూ నేటి మానవ జీవన ప్రయాణంలో వయసుతో నిమిత్తం లేకుండా మనం ఊహించని వ్యాధులు సోకుతున్నాయన్నారు. ముఖ్యంగా ఒకప్పుడు వయస్సు పై బడి వచ్చే వ్యాధులు నేడు వయస్సుతో నిమిత్తం లేకుండానే వస్తున్నాయన్నారు. ముఖ్యంగా నేత్ర వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభం అవుతుందన్నారు. అనంతరం డాక్టర్ ఎంవీ రెడ్డి ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ ముద్దం వివేకానంద రెడ్డి మాట్లాడుతూ అన్ని అవయవాలకన్నా కళ్లు ముఖ్యమైనవన్నారు. ఎంతో సున్నితమైన కంటివ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా శాశ్వతంగా చూపును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. షుగర్ వ్యాధి వల్లన కంటికి సంబంధించి నరాల్లో జరిగే మార్పుల వల్లన రెటీనా క్షీణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. మొత్తం 111 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్యప్రకాశరావు, అధ్యక్షుడు గద్దె చలమయ్య, మహిళా సంఘ నాయకులు గద్దె ఉమశ్రీ, గుంటుపల్లి రజని, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రాజ్‌కుమార్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి హరిపోతురాజ్, తదితరులు ఉన్నారు.

వంతెనపై ప్రయాణం భయం..భయం



రిటైనింగ్ వాల్ పగిలి ప్రమాదకరంగా ఉన్న నెమలిపురి మేజర్‌పై వంతెన

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి గ్రామపరిధిలో కారంపూడి రోడ్డుపై నిర్మించిన నెమలిపురి వంతెన ప్రమాదకరంగా మారింది. అటుగా ప్రయాణం చేసే ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. బెల్లంకొండ బ్రాంచికెనాల్‌పై గుండ్లపల్లి గ్రామం పరిధిలోని ఇటుకబట్టీల వద్ద నెమలిపురి మేజర్ ఉంది. మేజర్‌పై గుండా కారంపూడి రోడ్డు ఉండడంతో వాహనాలు రాకపోకలు సాగించే విధంగా వంతెన నిర్మించారు. వంతెనపై నుంచి వాహనదారులు పడిపోకుండా ఉండేందుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించారు. ఒకవైపు నిర్మించిన రిటైనింగ్ వాల్ కూలిపోవడంతో ప్రమాదకరంగా మారింది. అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రాత్రిళ్లు వాహనాల క్రాసింగ్ సమయంలో కూడా ప్రమాదం పొంచి ఉంది. ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా ఇసుకబస్తాలు పెట్టి చేతులు దులుపుకొన్నారు. పరిష్కారమార్గం చూపలేదు. దీంతో ఏ క్షణంలోనైనా వాహనదారులకు ముప్పు పొంచి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రిటైనింగ్‌వాల్ నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జయప్రదం చేయండి

నరసరావుపేట: కాకినాడలో వచ్చే నెల ఐదో తేదీ నుంచి ఎనిమిది వరకు నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రేమ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని జిల్లా కార్యాలయం వద్దనున్న పతాకాన్ని సీనియర్ నాయకులు ఎస్.స్లీవరాజు ఆవిష్కరించిన అనంతరం మహాసభల జయప్రదం కోసం సన్నాహక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో రెండోసారి యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు ముఖ్యమంత్రి హాజరవుతున్నారని గుర్తుచేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన వారి హక్కులకోసం ఎన్నో పోరాటాలు చేసిందని, ప్రస్తుతం అనుభవిస్తున్న రాయితీలు హక్కులు యూటీఎఫ్ పోరాట ఫలితమేనని తెలిపారు. పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడమే ప్రధాన అజెండాగా స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఫెడరేషన్ కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. పాలకవర్గాల నిర్బంధాలు, కేసులు, అవరోధాలను అధిగమించి ఉపాధ్యాయులను పోరుబాట పట్టించి సమస్యల పరిష్కారంలో అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడం, రాజ్యాంగం లక్ష్యాలు, విలువలు కాపాడుకోవడం ఉపాధ్యాయుల ప్రధానకర్తవ్యంగా ఉండాలని తెలిపారు.. విద్యారంగం ప్రైవేటీకరణ కాకుండా ప్రతిఘటించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వాల్యానాయక్, ఏ.భాగేశ్వరీదేవి, జిల్లా కార్యదర్శులు టి.వెంకటేశ్వర్లు, కె.ఉషా శౌరిరాణి, జి.ఆంజనేయులు, ప్రాంతీయ శాఖల బాధ్యులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే తప్ప స్పందించరా..?



ప్రమాదం జరిగిన ప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ప్రమాదంలో ధ్వంసమైన కారు(ఫైల్

పిడుగురాళ్ల: ప్రమాదాలు జరిగితే తప్పా సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేని పరిస్థితి అధికారుల్లో నెలకొంది. ఇటీవలే మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో అద్దంకి నార్కెట్‌పల్లి హైవేపై గీతిక సీబీఎస్‌సీ స్కూల్ సమీపంలో మూల మలుపు వద్ద కారు ప్రమాదం ఘటనలో నలుగురు మృతి చెందారు. ఈ నెల 8న తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఈ ప్రాంతంలోని మూల మలుపులో అతివేగంగా వస్తున్న వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ముందస్తు హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు అప్రమత్తం కాలేకపోతున్నారు. రేడియం స్టిక్కర్లతో ప్రమాదం జరుగు మూల మలుపుల్లో ఏర్పాటు చేస్తే..రాత్రిళ్లు వాహనాల లైట్ల వెలుగుకు వాహనాలు నడిపే వారికి హెచ్చరిక బోర్డులు స్పష్టంగా కనిపిస్తాయి. అటువంటి సమయంలో వాహనదారులు వేగం తగ్గించుకొని నిదానంగా వెళ్లే అవకాశాలు ఉంటాయి. తద్వారా ప్రమాదాలు జరగకుండా అండే అవకాశం ఉంటుంది. ప్రమాదం జరిగిన వారం రోజుల తర్వాత ఈ ప్రాంతంలో ముందు మూల మలుపు ఉంది, నెమ్మదిగా పోవాలని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలు జరిగితే తప్పా హెచ్చరికబోర్డులను ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో అధికార యంత్రాంగం ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.